

కిరండోల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

విశాఖపట్నం, జనవరి 29: ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు ఫిబ్రవరి రెండో తేదీ నుంచి అదనంగా ఒక విస్టాడోమ్ కోచ్‌ను జత చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలుకు (08551) ఫిబ్రవరి రెండు నుంచి మార్చి 31వ తేదీ వరకు ప్రతి శుక్ర, శని, ఆదివారం, తిరుగు ప్రయాణంలో కిరండోల్-విశాఖ రైలుకు (08552) ఫిబ్రవరి మూడు నుంచి ఏప్రిల్ ఒకటి వరకు ప్రతి శని, ఆది, సోమవారాల్లో ఈ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

మహిళా సంఘాల చేతికి జల్ జీవన్ మిషన్

మన్యానికి రూ.421 కోట్లతో 5,460 పనులు మంజూరు

ప్రస్తుతానికి సగం పనులు పూర్తి... వివిధ దశల్లో మిగిలిన పనులు

తమకు అనుకూలంగా ఉన్న సంఘాలతో పనులు చేయించేందుకు సన్నాహాలు

రాష్ట్ర స్థాయిలో చక్రం తిప్పిన వైసీపీ పెద్దలు

ఈ పరిణామాలతో తూతూ మంత్రంగా పనులు జరిగే అవకాశం?

(ఆంధ్రజ్యోతి- పాడేరు)

మన్యంలో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనులను ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాలు చేపట్టనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తమకు అనుకూలంగా ఉన్న స్వయం సహాయక సంఘాలకు ఈ పనులు దక్కేలా వైసీపీ నేతలు చక్రం తిప్పారన్న ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలతో ఇన్నాళ్లు గ్రామీణా నీటి సరఫరా విభాగంలో పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ల వ్యవస్థకు క్రమంగా చరమగీతం పాడనున్నట్టు తెలుస్తున్నది.



పాడేరు మండలం డి.గొందూరులో జల్ జీవన్ మిషన్‌లో వేసిన కొళాయిలు (ఫైల్ ఫొటోలు)

ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'జల్ జీవన్ మిషన్' పేరిట 2020లో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామాల్లో మరమ్మతులకు గురైన నీటి పథకాలను బాగు చేయడంతోపాటు కనీస తాగునీటి సదుపాయం లేని పల్లెలకు కొత్తగా తాగునీటి సదుపాయాలు కల్పించడం ప్రధానం. అలాగే ఆయా గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీటిని అందించడమే లక్ష్యం. ఏజెన్సీలోని పదకొండు మండలాల్లో 5,460 పనులను చేపట్టేందుకు రూ.421 కోట్ల 27లక్షల 76 వేలు నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా పనులను గ్రామీణా నీటి సరఫరా విభాగం అధికారులు కాంట్రాక్టర్లతో చేపడుతున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా మొత్తం 5,460 పనులు మంజూరు కాగా, వాటిలో ఇప్పటికీ సగానికిపైగా పనులు అంటే 2,921 పనులు పూర్తికాగా, 2548 పనులు వివిధ దశల్లో వున్నాయి.

సకాలంలో విడుదల కాని బిల్లులు

వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 2020లో ప్రారంభమైన జల్ జీవన్ మిషన్ పనులను 2024 ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాల్సి ఉంది. కానీ ఆయా పనులు చేపడుతున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు మందకొడిగా జరుగుతున్నాయి. ఏజెన్సీకి మంజూరైన పనుల్లో గత నాలుగేళ్లలో సగం మాత్రమే ఇప్పటికీ పూర్తికాగా, మరో సగం పనులు చేపట్టాల్సి ఉంది. అవి సైతం పూర్తి కావాలంటే యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి, సకాలంలో బిల్లులు మంజూరు చేసినా కనీసం రెండేళ్లు సమయం పడుతుంది. కానీ ఆ దిశగా వేగంగా పనులు చేపట్టే పరిస్థితులు ప్రస్తుతం లేవు.

ఇకపై మహిళా సంఘాలతోనే పనులు

ఇన్నాళ్లు టెండర్లు వేసి కాంట్రాక్టర్లతో చేపడుతున్న జల్ జీవన్ మిషన్ పనులు ఇకపై స్వయం సహాయక సంఘాలతో చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అయితే గతంలో వెలుగు ద్వారా స్వయం సహాయక సంఘాలతో వందల సంఖ్యలో తాగునీటి పథకాలను నిర్మించారు. వాటిలో 80 శాతం పథకాలు నిర్మించిన అనతికాలంలోనే మూలకు చేరాయి. ఈ తరుణంలో జల్ జీవన్ మిషన్ పనులను సైతం వారితోనే చేయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే జరిగితే, పనులన్నీ మొక్కుబడిగా జరగడంతో పాటు గ్రామాల్లో తాగునీటి సమస్యలకు పరిష్కారం లభించదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే ఇన్నాళ్లు వున్న కాంట్రాక్టర్ల వ్యవస్థను దూరం చేసి తమకు అనుకూలంగా వున్న స్వయం సహాయక సంఘాల ద్వారా ఎటువంటి టెండర్లతో పని లేకుండా ఆయా పనులు చేపట్టాలనే లక్ష్యంతోనే ఈ మార్పు జరిగిందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

పార్టీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లయినా తమకు ఒనగూరిందేమీ లేదంటూ ఆగ్రహం



సంగివలసలో వైసీపీ సభ (ఫైల్)

స్థానిక నాయకత్వంపై తీవ్ర అసహనం

- సభలు, సమావేశాలకు హాజరవ్వడం తప్ప ఇల్లు కూడా పొందలేకపోయానని వాపోయిన ఒక కార్యకర్త
- తమ ఎమ్మెల్యేలు ఓడిపోతారంటూ వ్యాఖ్యలు
- ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోవడం, రోడ్లు బాగుండకపోవడం పార్టీకి మైనస్ అవుతుందన్న 'చోడవరం' కార్యకర్త
- 'నెల్లిమర్ల', 'చోడవరం' నియోజకవర్గాల్లో కష్టమే
- బేబీ నాయనకు 'శంబంగి' ఎదురు నిలవలేరన్న 'బొబ్బిలి' కార్యకర్త
- షర్మిల వల్ల నష్టపోతామనే అంచనాలో కార్యకర్తలు

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ నేతల తీరుపై సామాన్య పౌరుల్లోనే కాదు... ఆ పార్టీ కేడర్‌లోనూ అసంతృప్తి నెలకొని ఉంది. పార్టీ అధికారంలోకి వచ్చినా అధినేత జగన్మోహన్‌రెడ్డి గానీ, స్థానికంగా ఉండే ఎమ్మెల్యేలు గానీ తమకు ఏమీ చేయలేదన్న భావన మెజారిటీ కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. కొన్ని నియోజక వర్గాల్లో స్థానిక నాయకత్వంపై పార్టీ శ్రేణులు ఆగ్రహంతో ఉండడం కనిపించింది.

రెండు రోజుల క్రితం భీమిలి నియోజకవర్గ పరిధిలోని సంగివలసలో నిర్వహించిన సభకు హాజరైన కార్యకర్తలను 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధులు కదిలించినప్పుడు...తమలో దాగి ఉన్న అసంతృప్తిని బయట పెట్టారు. కొంతమంది సీఎం జగన్మోహన్‌రెడ్డి తీరు పట్ల అసహనం వ్యక్తం చేస్తుండగా, మరికొంతమంది తమ ఎమ్మెల్యేలపై అసంతృప్తితో ఉన్నారు. విజయనగరం జిల్లా నెల్లిమర్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అయితే ఈసారి ఓడిపోవడం ఖాయమని ఆ నియోజకవర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అక్కడ ప్రతిపక్షాలు సరైన అభ్యర్థిని బరిలోకి దింపితే విజయావకాశాలు పుష్కలంగా ఉంటాయని నియోజకవర్గానికి చెందిన శ్రీరాములు అనే కార్యకర్త అభిప్రాయపడ్డారు. అప్పలనాయుడు అయితే ఈసారి తప్పనిసరిగా ఓడిపోతాడంటూ మరో కార్యకర్త పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థికి పతివాడ నారాయణస్వామి నాయుడు సహకరిస్తే అక్కడ గెలుపు ప్రతిపక్షాలకు సులభం అవుతుందని మరో కార్యకర్త పేర్కొన్నారు.

అనకాపల్లి జిల్లా చోడవరంలో ప్రస్తుతం గట్టి పోటీ నెలకొందని ఆ నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వెల్లడించారు. ప్రస్తుతం సమంగా ఉన్నట్టు కనిపిస్తోందని, ఈ పరిస్థితి మారిపోయే చాన్స్ ఉందని జోగినాయుడు అనే మరో కార్యకర్త తెలిపారు. చోడవరంలో సిట్టింగ్ ఎమ్మెల్యే ధర్మశ్రీ గెలిచే అవకాశాలు దాదాపు లేవని మరో కార్యకర్త తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఇక్కడ వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మంచి అవకాశం ఉందని రామారావు అనే కార్యకర్త చెప్పారు. ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేక పోవడం, రోడ్లు బాగుండకపోవడం స్థానికంగా పార్టీకి మైనస్‌గా ఉందని మరో కార్యకర్త వాపోయారు. జగన్ వరకూ ఫర్వాలేదని, స్థానికంగా ఎమ్మెల్యే పనితీరు ఆశాజనకంగా లేదంటూ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి వచ్చిన కార్యకర్త అన్నారు.

విజయనగరం జిల్లా బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చిన వెంకట అప్పలనాయుడుకు క్లిష్ట పరిస్థితులు ... మిగతా 8వ పేజీలో



పరిశోధన ఫలితాల సమగ్ర సమాచార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదివాసీ రైతుల ప్రగతికి నూతన సంస్కరణలు

జాతీయ స్థాయి నిపుణుల కమిటీతో ప్రత్యేక ప్రణాళిక

విశ్వవిద్యాలయం ఆమోదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక

జాతీయ సదస్సులో ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారద జయలక్ష్మి

చింతపల్లి, జనవరి 29: ఉన్నత పర్వత శ్రేణి గిరిజన మండలాల ఆదివాసీ రైతుల వ్యవసాయ ప్రగతి లక్ష్యంగా నూతన సంస్కరణలు ఆవిష్కరించేందుకు జాతీయ స్థాయి నిపుణుల కమిటీతో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. ప్రారంభ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వవిద్యాలయం ఉపకులపతి మాట్లాడుతూ ఆదివాసీ జనాభాలో 90 శాతం ప్రజలు



చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల స్టాల్‌ను పరిశీలిస్తున్న ఉపకులపతి శారద జయలక్ష్మి

వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఆదివాసీ రైతులకు అధిక ఆదాయం సమకూరే కొత్త పంటలు, నూతన సాంకేతిక పరిజ్ఞానం పరిచయం చేయడం వల్ల ఆర్థిక ప్రగతి సాధించడంతో పాటు నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ నేపథ్యంలో చింతపల్లి పరిశోధన స్థానంలో జాతీయ సదస్సు ఏర్పాటు ... మిగతా 8వ పేజీలో

విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని

పాడేరు ఏఎస్పీ ధీరజ్ బదిలీ

ఆయన స్థానంలో జగదీశ్ అడహల్లి నియామకం

విశాఖ సిటీ జాయింట్ పోలీస్ కమిషనర్‌గా ఫకీరప్ప

విశాఖపట్నం/పాడేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల పదోన్నతి పొందిన విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణను ఐజీ పర్సనల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఆయన స్థానంలో విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న విశాల్ గున్నీని నియమించారు.



విశాల్ గున్నీ



జగదీశ్ అడహల్లి

నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, విజయనగరం 5వ బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. పాడేరు ఏఎస్పీ కె.ధీరజ్‌ను రంపచోడవరం ఏఎస్పీగా బదిలీ చేసి, అక్కడ పనిచేస్తున్న ఎ.జగదీశ్‌ను పాడేరు ఏఎస్పీగా నియమించారు. కాగా గత కొంతకాలంగా ఖాళీగా ఉన్న విశాఖ నగర ... మిగతా 8వ పేజీలో



పాడేరులో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు పొగమంచు

కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

జి.మాడుగులలో 8.5, అరకులోయలో 10.8 డిగ్రీలు

కొనసాగుతున్న చలి, పొగమంచు

పాడేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో చలి, పొగమంచు కొనసాగుతున్నది. జి.మాడుగులలో 8.5, అరకులోయలో 10.8, జీకేవీధిలో 11.3, పాడేరులో 12.7, పెదబయలులో 13.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు సోమవారం నమోదయ్యాయి. గత మూడు రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుతుండడంతో చలి ప్రభావం పెరుగుతున్నది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పాటు ఉత్తరాది నుంచి చలిగాలులు వీస్తుండడంతో చలి తీవ్రత, పొగమంచు కొనసాగుతున్నది. ఏజెన్సీలో తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకు దట్టంగా పొగమంచు కమ్మేస్తున్నది.



చింతపల్లిలో మంచు

అరకులోయలో..

అరకులోయ: పట్టణంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంది. సోమవారం ఉదయం 9.30 గంటల వరకు మంచు తెరలు వీడలేదు. వాహనచోదకులు హెడ్ లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు. కాగా పర్యాటకులు మంచులో ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

చింతపల్లిలో..

చింతపల్లి: మండలంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో చలి ... మిగతా 8వ పేజీలో

విద్యుత్ చార్జీలు పెంచబోం

- ఈ ఆర్థిక సంవత్సరం భారం మోపబోం
- ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్
- 2024-25 ఆదాయ అంచనాలు రూ.21,162 కోట్లు
- ప్రతిపాదిత ధరల రాబడి రూ.100.44 కోట్లు
- ఒక్క రైల్వే ట్రాక్షన్ చార్జీలు యూనిట్‌కు రూపాయి పెంపునకు ప్రతిపాదన



సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులపై ఈ (2024-25) ఆర్థిక సంవత్సరంలో ఎటువంటి భారం మోపడం లేదని, చార్జీలు పెంచడం లేదని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ వెల్లడించారు. విశాఖపట్నం కార్పొరేట్ కార్యాలయంలో ఏపీఈఆర్సీ సోమవారం నిర్వహించిన టారిఫ్ ప్రతిపాదనల స్వీకరణ, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని డిస్కమ్ ప్రగతిని, ప్రతిపాదనలు వివరించారు. కేవలం రైల్వే ట్రాక్షన్ చార్జీలను మాత్రం యూనిట్‌కు రూపాయి పెంచడానికి అనుమతి ఇవ్వాలని కోరారు. నాలుగేళ్ల నుంచి యూనిట్‌కు రూ.5.50 మాత్రమే వసూలు చేస్తున్నామని, సర్వీసు ధర 40 శాతం పెరిగిందని, ఈ నేపథ్యంలో పెంపు అనివార్యమన్నారు. దీనివల్ల డిస్కమ్‌కు అదనంగా రూ.100.24 కోట్లు సమకూరుతుందన్నారు. అలాగే ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్లను ఓల్టేజ్ సర్వీసు వ్యయంతో టారిఫ్‌కు లింకు చేయాలని ప్రతిపాదించారు. ప్రస్తుత ధరల నుంచి రూ.17,854.16 కోట్ల ఆదాయం వస్తుందని, ప్రతిపాదిత ధరల ద్వారా రూ.100.44 కోట్లు, ప్రతిపాదిత పర్ కాస్ట్ రికవరీ నుంచి రూ.3,207.27 కోట్లు కలిపి మొత్తం రూ.21,161.86 కోట్లు వస్తుందని అంచనా వేసినట్టు వివరించారు. రాబడి లోటు ఏమీ లేదని ... మిగతా 8వ పేజీలో

వంద టన్నుల మిరియాలు కొనుగోలు లక్ష్యం

కలెక్టర్ సుమిత్‌కుమార్

ఐటీడీఏ ద్వారా

కిలో రూ.500 చొప్పున కొనుగోలు చేస్తామని వెల్లడి

పాడేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది గిరిజన రైతుల నుంచి వంద టన్నుల మిరియాలు కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ పరిధిలోని వ్యవసాయాధికారులు, ఉద్యానవన అధికారులు, కాఫీ లైజన్ వర్కర్లతో మిరియాలు కొనుగోలుపై సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో ఉత్పత్తి చేస్తున్న మిరియాలను దళారులకు తక్కువ ధరకు విక్రయించకుండా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏజెన్సీలో కొయ్యూరు మినహా ప్రతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

మండలంలో పది టన్నులు చొప్పున మిరియాలు కొనుగోలు చేస్తామన్నారు. కిలో మిరియాలు రూ.500లు చొప్పున రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. కేవలం నాణ్యమైన మిరియాలను మాత్రమే కొనుగోలు చేస్తామని, రైతులు మిరియాల ఉత్పత్తిలో నాణ్యతలు పాటించాలన్నారు. మిరియాలు విక్రయించిన రైతులకు చెల్లింపుల్లో ఎటువంటి ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

ద్విచక్ర వాహనం చోరీ

పాయకరావుపేట, జనవరి 29 : పట్టణంలోని కురుమళ్ల లేఅవుట్‌లో ఆదివారం అర్ధరాత్రి ముసుగులు వేసుకుని వచ్చిన నలుగురు వ్యక్తులు ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనాన్ని దొంగిలించుకుపోయారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలో టీవీ మెకానిక్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి ఆదివారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు ఉంచారు. అర్ధరాత్రి దాటిన తరువాత నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు ముసుగు వేసుకువచ్చి ద్విచక్ర వాహనం హ్యాండిల్ లాక్‌కి తొలగించి దర్జాగా వేసుకుని వెళ్లిపోయారు. దొంగలు ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు తెలిపాడు.

గుర్తుతెలియని మహిళ మృతి

ముంచంగిపుట్టు, జనవరి 29: మండలంలోని కిలగాడ పంచాయతీ కేంద్రంలో గల బస్ షెల్టర్ వద్ద సోమవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆ పంచాయతీ సర్పంచ్ కె.శివశంకర్ ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మహిళ(56) కిలగాడ ప్రాంతంలో గత వారం రోజులుగా సంచరిస్తున్నది. గ్రామ సమీపంలో గల బస్ షెల్టర్ వద్ద ఉంటూ కాలం గడుపుతున్నది. స్థానికులు ఆమెకు రోజూ ఆహారాన్ని ఇచ్చేవారు. అయితే గత మూడు రోజులుగా చలి తీవ్రత ఎక్కువైంది. ఆమె చలికి తట్టుకోలేక మృతి చెంది ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని మహిళ మృతి చెందిందన్న విషయం తెలుసుకున్న సర్పంచ్‌తో పాటు ఆ గ్రామస్థులు దగ్గరుండి మృతదేహానికి అంత్యక్రియలు చేయించారు.

11 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

కోటవురట్ల, జనవరి 29: మండలంలో రామన్నపాలెంలో ఒక ఇంటిలో సోదాలు నిర్వహించి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రమణయ్య చెప్పారు. రామన్నపాలెం గ్రామానికి చెందిన పొలిపర్తి అప్పలనాయుడు తన ఇంటివద్ద మద్యం విక్రయిస్తున్నట్టు అదే గ్రామానికి చెందిన ఒకవ్యక్తి సమాచారం ఇచ్చారని ఆయన తెలిపారు. తనతోపాటు ఇద్దరు పోలీసులు వెళ్లి అప్పలనాయుడు ఇంటిలో తనిఖీలు చేయగా 11 మద్యం సీసాలు లభించాయన్నారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశామన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కోటవురట్ల, జనవరి 29: మండలంలోని రాజుపేట వద్ద సర్పా నదిలో నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ రమణయ్య చెప్పారు. కోటవురట్ల, మాకవరపాలెం మండలాల సరిహద్దులో రాజుపేట వద్ద సర్పా నదిలో ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తున్నట్టు స్థానికులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి ఇసుక రవాణా చేస్తున్న మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానికి రూ.10 వేలు అపరాధ రుసుము విధిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు

- విశాఖ కానిస్టేబుల్‌పై స్పందనలో బాధితుల ఫిర్యాదు

చోడవరం, జనవరి 29: పోలీస్ శాఖలో, నేవల్ డాక్‌యార్డులో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ విశాఖ సిటీ కంచరపాలెం స్టేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కసిరెడ్డి రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబు తమ నుంచి డబ్బులు వసూలు చేసి మోసం చేశారని పలువురు నిరుద్యోగులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన కానిస్టేబుల్ కసిరెడ్డి రమణమూర్తి, అతని సోదరుడు మోహన్‌బాబు కచ్చితంగా ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పడంతో తామంతా రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వారికి ముట్టజెప్పామని, తీసుకున్న డబ్బులకు సంబంధించి కొందరికి బ్యాంకు చెక్కులతో పాటు, నోట్లు కూడా ఇచ్చారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎప్పుడు అడిగినా వచ్చేస్తున్నాయంటూ తప్పించుకుంటూ తిరుగుతున్నారని, డబ్బులైనా తిరిగి ఇచ్చేయాలని అడిగితే వారు తమను బెదిరిస్తున్నారని వాపోయారు.

మండల సమావేశంలో అన్యుల హవా!

- మహిళా సభ్యులకు బదులు పురుషులు హాజరు
- పలు అంశాలపై అధికారులకు ప్రశ్నలు
- చోద్యం చూస్తున్న మండల పరిషత్ అధికారులు


ప్రశ్నిస్తున్న బంగారమ్మపాలెం ఎంపీటీసీ సభ్యురాలు రాపేటి అరుణ భర్త రాము

సబ్బవరం, జనవరి 29 : స్థానిక సంస్థల్లో మహిళలకు కల్పించిన రిజర్వేషన్లను అధికార పార్టీ నేతలు అవహాస్యం చేస్తున్నారు. మండల పరిషత్ సమావేశానికి మహిళా ప్రజాప్రతినిధులకు బదులు వారి కుటుంబాలకు చెందిన పురుషులు దర్జాగా హాజరవుతున్నారు. పైగా పలు అంశాలను సమావేశంలో ప్రస్తావిస్తూ, అధికారులను నిలదీస్తున్నారు. సభ్యులు కానివారిని సమావేశాలకు హాజరుకాకుండా చూడాల్సిన ఎంపీడీవోలు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో తరచూ ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ జడ్పీ సీఈవో సైతం పట్టించుకోవడంలేదు. తాజాగా సోమవారం జరిగిన సబ్బవరం మండల సర్వసభ్య సమావేశంలో ఈ తరహా సంఘటనే చోటుచేసుకుంది. బంగారమ్మపాలెం ఎంపీటీసీ నుంచి రాపేటి అరుణ ప్రాతినిధ్య వహిస్తున్నారు. మండల పరిషత్ సమావేశానికి ఆమెతోపాటు భర్త రాము కూడా వచ్చారు. అంతేకాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులు తీసుకొని ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వకుంటే అన్నీ బాగున్నా రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో పెడుతున్నారని సమావేశానికి హాజరైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక టీడీపీకి చెందిన వంగలి సర్పంచ్ ఆకుల శ్రీహేమ భర్త గణేశ్ కూడా సమావేశానికి హాజరై సమస్యలపై అధికారులను ప్రశ్నించారు. దీనిపై ఎంపీడీవో రమేశ్‌నాయుడును వివరణ కోరగా, అనుకోకుండా వారిద్దరు (రాపేటి రాము, ఆకుల గణేశ్) సభలోకి వచ్చారని, తనకు బదిలీ అయి, రిలీవ్ అయ్యే హడావిడిలో ఉండగా ఈ సంఘటన చోటు చేసుకుందన్నారు.

‘అసంపూర్తిగా ఉన్న సచివాలయాన్ని ప్రారంభిస్తే అడ్డుకుంటాం’

గొలుగొండ, జనవరి 29: మండలంలోని పాతమల్లంపేటలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభిస్తే అడ్డుకుంటామని గ్రామ సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి హెచ్చరించారు. మండలంలో ఈ నెల 30వ తేదీన పలు గ్రామ సచివాలయాలను స్థానిక ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ ప్రారంభించేందుకు ఆయా గ్రామాల్లో సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా పాతమల్లంపేట గ్రామ సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం రూ.40 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ భవన నిర్మాణాన్ని సంబంధిత కాంట్రాక్టరు కొంత మేర పూర్తి చేశారు. దీనిపై సోమవారం పాతమల్లంపేట సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి విలేకరులతో మాట్లాడుతూ గ్రామ సచివాలయ భవనానికి ఇప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయలేదన్నారు. మరుగుదొడ్లు కూడా అసంపూర్తిగా ఉన్నాయన్నారు. పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేపట్టకుండా భవనాన్ని ప్రారంభించడమేమిటని సంబంధిత అధికారులను, పాలకులను ప్రశ్నించారు. ఈ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించాలనుకుంటే హెచ్చరించారు. హెల్త్ సెంటర్, ఆర్‌బీకె భవనాలు అసంపూర్తి పనులతో రెండున్నరేళ్లుగా దర్శనమిస్తున్నట్టు తెలిపారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	565
విజయనగరం	569
శ్రీకాకుళం	569

ఫార్మా వ్యర్థాల ల్యాండ్ ఫిల్‌కు అనుమతులు ఇవ్వొద్దు

- రాంకీపై కేసు నడుస్తుండగా ప్రజాభిప్రాయ సేకరణ చట్టవిరుద్ధం
- సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం
- స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాంకీ కాలుష్యంపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్‌జీటీ)లో కేసు నడుస్తుండగా తాడిలో ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు ఈ నెల 30న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం చట్ట విరుద్ధమని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రవిపట్టన్‌శెట్టికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం లోకనాథం మీడియాతో మాట్లాడుతూ, పరవాడ మండలం తాడి గ్రామం సర్వే నంబరు 116లో ఫార్మాసిటీ డెవలపర్ అయిన ర్యాంకీ మరో 50 ఎకరాల్లో ప్రమాదకర వ్యర్థాల శుద్ధి నిల్వ(ల్యాండ్ ఫిల్) ఏర్పాటుకు సిద్ధపడుతోందన్నారు. దీనికోసం మంగళవారం పరవాడలో కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయం సేకరణ నిర్వహిస్తున్నదన్నారు. కాలుష్య నియంత్రణ పద్ధతులు, నియమ నిబంధనలు, చట్టపరమైన సూత్రాలు పాటించని ర్యాంకీకి ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు అనుమతులివ్వడం మంచిదికాదన్నారు. ఇప్పటికే తాడి, తానాం, బీసీ కాలనీ, పరవాడ, లంకెలపాలెం, వల్లూరు, వెంకటాపురం, టి.సిరసపల్లి, కొత్తూరు, అనకాపల్లి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్రమైన కాలుష్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. తాడి గ్రామ ప్రజలు ఫార్మా కంపెనీల కాలుష్యం బారినపడి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్నారన్నారు. పర్యావరణ నిబంధనలు పాటించని ర్యాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోగా, మరో ల్యాండ్ ఫిల్‌కి అనుమతి ఇచ్చి మరింత తప్పు చేయడానికి అధికారులు ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాంకీకి కేటాయించిన 50 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని, మంగళవారం చేపట్టనున్న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

పరవాడ: ఫార్మాసిటీలో ఘన వ్యర్థాల నిల్వ కోసం అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు మంగళవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తహసీల్దార్ వి.కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల రెవెన్యూ కార్యాలయం పక్కన వున్న ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. రాంకీ ఆధ్వర్యంలో తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 116లో వున్న 50 ఎకరాల విస్తీర్ణంలో ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

సంగీతం ఉన్నంత వరకు ‘వేటూరి’ని మరువలేం

- సినీ రచయిత, దర్శకుడు జేకే భారవి
- శ్రీప్రకాష్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా వేటూరి కవితా పురస్కారం


పుస్తకాలతో జేకే భారవిని సత్కరించిన దృశ్యం

తుని రూరల్, జనవరి 29: ‘కలలు చెదిరినా పాటే, కలత చెందినా పాటే’.. ఎలాంటి భావాన్నైనా పలికించగలిగే శక్తి వేటూరికే సాధ్యమని, క్లిష్టమైన, సరళమైన పదాలతో గారడీ చేస్తూ ఆడుకోవడం ‘వేటూరి’ మాత్రమే చేయగలరని, సంగీతం, సాహిత్యం ఉన్నంతవకు వేటూరిని మరిచిపోలేమని ప్రముఖ తెలుగు సినీ రచయిత, దర్శకుడు, పాటల రచయిత జేకే భారవి అన్నారు. తునిలోని చిట్టూరి మెట్రోలో వేటూరి సాహితి పీఠం, శ్రీప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వేటూరి జయంతి వేడుకల్లో ఈ ఏడాది త్రయోదశ(13వ) వేటూరి కవితా పురస్కారాన్ని జేకే భారవి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేటూరి వారి పురస్కారానికి తనను ఎంపిక చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. నేటి యువతకు గాయకులుగా, గేయ రచయితలుగా చాలా అవకాలున్నాయని, సరస్వతిని కొలిస్తే వచ్చే జ్ఞానం మనల్ని కాపాడడమే కాకుండా మన భూగోళాన్ని కాపాడుకోవడమే మన ప్రథమ కర్తవ్యంగా తెలియజేస్తుందన్నారు. కవులకు ధనం ముఖ్యం కాదని, వారి వాక్చాతుర్యం, రచనాశైలి వారికి నిజమైన సంపద అని అన్నారు. అన్నమయ్య, రామదాసు, మంజునాథ సినిమాలకంటే ఆదిశంకరాచార్య సినిమాకు యూట్యూబ్ వీక్షకులు ఎక్కువ ఉండడం తనకు వచ్చిన విజయంగా భావిస్తున్నానన్నారు. ఎక్కడో పుట్టిన మహానుభావుడిని దేశం అంతటా జయంతి వేడుకలు చేస్తున్నామంటే ఆయన గొప్పదనాన్ని నేటి యువత తెలుసుకోవాలని అన్నారు. వేటూరి వంటి మహానుభావుని జయంతి వేడుకలు ఇంత ఘనంగా జరగడం తెలుగు సాహిత్యానికి ఇస్తున్న గౌరవమని, తెలుగు సాహిత్యానికి, సంగీతానికి, తెలుగుపాటకు వన్నె తెచ్చిన వ్యక్తిగా వేటూరి చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన అన్నవరం దేవస్థానం అదనపు కమిషనర్ కోడూరి రామచంద్రమోహన్, రసమాధురి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరాల సీతారామ ప్రభు మాట్లాడుతూ వేటూరి మన మధ్య లేకపోయినా పాటల రూపంలో బతికే ఉన్నారని, కవులు ఉన్నంతకాలం తెలుగు భాష వైభవం తగ్గదన్నారు. వేటూరి జయంతి సందర్భంగా సినీరంగ సాహిత్య ప్రముఖులకు ఏటా పురస్కారాలు అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేటూరి సాహితి పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే శర్మ, ప్రధాన కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్‌ల కృషి అభినందనీయమన్నారు. అనంతరం సన్మాన గ్రహీత జేకే భారవిని తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు పుస్తకాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వేటూరి సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు చక్కా సూర్యనారాయణ, శ్రీప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, వేటూరి సాహితీ పీఠం వ్యవస్థాపక కార్యదర్శి కేఆర్‌జే.శర్మతోపాటు తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై సత్వరమే స్పందించండి

- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం


అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 29: స్పందనలో ప్రజలు అందజేసే అర్జీలపై సత్వరమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జేసీ, డీఆర్‌వోలతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి పలు సమస్యలపై 494 అర్జీలు అందజేశారు. అనంతరం వీటిని సంబంధిత శాఖల అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, స్పందనలో వచ్చే అర్జీలు ప్రధానంగా భూసమస్యలు, రేషన్‌కార్డులపై అధికంగా వుంటున్నాయని, సంబంధిత అధికారులు వాటి పరిష్కారానికి దృష్టి సారించాలని ఆదేశించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లిరూరల్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఎస్పీ కేవీ మురళీకృష్ణ పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిష్కారం కోసం అర్జీలను సంబంధిత అధికారులకు బదలాయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వాటిపై తీసుకున్న చర్యల గురించి నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 46 మంది అర్జీలు అందజేయగా వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటివి అధికంగా వున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ విజయభాస్కర్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఉప్పరాపల్లి హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎంకు ప్రధాని అభినందనలు


ఢిల్లీలో నిర్వహించిన పరీక్షా పే చర్చా కార్యక్రమంలో ఉప్పరాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం

ఎస్.రాయవరం, జనవరి 29: ఢిల్లీలోని ప్రగతి మైదాన్ భారత్ మండపంలో సోమవారం నిర్వహించిన ‘పరీక్షా పే చర్చ’ కార్యక్రమంలో ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కొండకంచి సంపత్‌రావు సలహాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ మెచ్చుకుని అభినందించారు. ఈ సందర్భంగా సంపత్‌రావు ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, విద్యార్థులకు సంగీతాన్ని వినిపించడం ద్వారా పరీక్షల్లో ఒత్తిడిని తగ్గించవచ్చన్న తన సమాధానం ఉత్తమ మైనదిగా గుర్తించి రాష్ట్రం తరపున పరీక్షా పే చర్చ కార్యక్రమానికి తనను ఎంపిక చేశారన్నారు. అయితే ఢిల్లీలో నిర్వహించే కార్యక్రమంలో తాను పాల్గొనాల్సి వున్నప్పటికీ సమయాభావం పీఎం కార్యాలయం వారు ఆదివారం విశాఖ నుంచి ప్రత్యేక బృందాన్ని ఇక్కడకు పంపి, తన ప్రసంగాన్ని వీడియో రికార్డింగ్ చేసుకున్నారని చెప్పారు. దీనిని ఢిల్లీలో నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో ప్రదర్శించగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ తిలకించి తనను మెచ్చుకున్నారని సంపత్‌రావు చెప్పారు. ఈ అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

‘తుది ఓటర్ల జాబితాలో అవకతవకలు’


ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై డీఆర్‌వోతో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 29 : అనకాపల్లి జిల్లాలో తుది ఓటర్ల జాబితాలో అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం రాత్రి డీఆర్‌వో బి. దయానిధిని కలిసి కోరారు. తుది ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పుల గురించి డీఆర్వోకు ఆయన వివరించారు. జాబితాల్లో ఉన్న లోపాలకు సంబంధించి తగిన ఆధారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ నాయకులు మళ్ల సురేంద్ర, సిరసపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 14న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం వచ్చే నెల 14వ తేదీన జరుగుతుందని సీఈవో ఎం.పోలినాయుడు తెలిపారు. చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సభ్యులు, ఆహ్వానితులు హాజరుకావాలని కోరారు. జిల్లా అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

9న డీ-వార్మింగ్ డే

- 1-19 ఏళ్ల వారందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలి
- కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 29: ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు వారికి నులిపురుగుల నుంచి రక్షణ కల్పించేందుకు ఫిబ్రవరి 9వ తేదీ డీ-వార్మింగ్ డే సందర్భంగా అల్బెండజోల్ మాత్రలు వేయాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన జేసీ ఎం.జాహ్నవి, డీఆర్‌వో బి.దయానిధిలతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ మాత్రలను అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా ఇస్తారని చెప్పారు. ఆ రోజు అల్బెండజోల్ మాత్రలు వేసుకోని పిల్లలకు 16వ తేదీన మాత్రలు వేయాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్ మాట్లాడుతూ, నులిపురుగుల సమస్య వున్న పిల్లలు మాత్రలు వేసుకున్న తర్వాత వికారం, కొద్దిగా కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తాయని, అయినా ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. మరింత సమాచారం కోసం ఏఎన్‌ఎంలు, ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలను సంప్రదించాలన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు బదిలీ?

- అనకాపల్లి కలెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తారని ఊహాగానాలు
- ఈ క్రమంలోనే అదనపు కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి విశ్వనాథన్ నియామకం
- జీవీఎంసీలో సర్వత్రా చర్చ


జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్‌వర్మకు త్వరలో బదిలీ అయ్యే అవకాశం ఉందని అధికార వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. 2015 బ్యాచ్‌కు చెందిన సాయికాంత్‌వర్మ పనితీరుపై వైసీపీ పెద్దల్లో సానుకూలభావం ఉంది. దీంతో ఆయనకు అనకాపల్లి జిల్లాకు కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చే అవకాశం ఉందని అధికారులతోపాటు వైసీపీ ముఖ్య నేతలు చెబుతున్నారు. ఆయన్ను కలెక్టర్‌గా పంపించే ఉద్దేశం ఉండడం వల్లే 2017 బ్యాచ్‌కు చెందిన జిల్లా జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌ను జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా నియమించారని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే ముగ్గురు అదనపు కమిషనర్లు ఉండగా, నాలుగో అదనపు కమిషనర్ అవసరం లేదని, ఇప్పుడున్న కమిషనర్‌ను బదిలీ చేస్తే విశ్వనాథన్‌ను ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉంచి పాలన సాగించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశంగా చెబుతున్నారు. కాగా జాయింట్ కలెక్టర్‌గా విశ్వనాథన్ ముక్కుసూటిగా వ్యవహరించడంతోపాటు వైసీపీ పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గలేదని రెవెన్యూ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని భూములకు సంబంధించిన ఫైళ్లను ఆయన వైసీపీ నేతల సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకుండానే వెనక్కి పంపించేశారని, అందువల్లే జాయింట్ కలెక్టర్ పోస్టు నుంచి బదిలీ చేశారని పేర్కొంటున్నారు. ముక్కుసూటి అధికారి అయిన విశ్వనాథన్ జీవీఎంసీ అదనపు కమిషనర్‌గా ఉంటే అక్కడ కీలకమైన విభాగాలను ఆయనకు అప్పగించే అవకాశం ఉందని, ఫైళ్లు అన్నీ పక్కాగా ఉంటేనే ఆయన ముందుకు పంపిస్తారని, లేనిపక్షంలో ఎవరు చెప్పినా రిమార్కులతో వెనక్కి పంపేస్తారని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

రికార్డుస్థాయిలో బెల్లం లావాదేవీలు

- ఎన్టీఆర్ మార్కెట్ యార్డుకు 16,030 బెల్లం దిమ్మలు రాక

అనకాపల్లి టౌన్, జనవరి 29: స్థానిక ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో సోమవారం రికార్డుస్థాయిలో బెల్లం లావాదేవీలు జరిగాయి. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి రైతులు వచ్చి 16,030 బెల్లం దిమ్మలు విక్రయించారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం. ఈ నెల ఎనిమిదో తేదీన అత్యధికంగా 14,939 బెల్లం దిమ్మల లావాదేవీలు జరిగాయి. సోమవారం మరో వెయ్యికిపైగా బెల్లం దిమ్మలు వచ్చాయిఇ. అయితే ఎనిమిదో తేదీనతో పోల్చితే ధరలు స్వల్పంగా తగ్గాయి. ఎనిమిదో తేదీన ఒకటో రకం వంద కిలోలు రూ.4,230లు, రెండో రకం రూ.3,850లు, మూడో రకం రూ.3,700లు పలకగా, సోమవారం ఒకటో రకం వంద కిలోలు రూ.4,100, రెండో రకం రూ.3,760, మూడో రకం రూ.3,550 పలికాయి. ఒకటో రకం రూ.130, రెండో రకం రూ.90, మూడో రకం రూ.150 చొప్పున ధరలు తగ్గాయి. ఇతర రాష్ట్రాల నుంచి డిమాండ్ తగ్గడంతో యార్డుకు వచ్చిన బెల్లంలో కొంత సరకును ఎగు మతి వర్తకులు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయగా, మరికొంత బెల్లాన్ని ఒడిశాతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

- సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలి
- ప్రత్యేక బస్సులు నడపాలి
- కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో ఇంటర్మీడియట్ పరీక్షలు, అంతకు ముందు ఫిబ్రవరిలో ప్రాక్టికల్ పరీక్షలు సజావుగా జరిగేలా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలని కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం స్పందన కార్యక్రమం తరువాత ఆయన అధికారులతో మాట్లాడుతూ విద్య, పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని పీటీడీ రీజనల్ మేనేజరును ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటిని అందుబాటులో వుంచాలని జీవీఎంసీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఆయా కళాశాలల్లో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులకు స్పష్టం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, పరీక్షల తనిఖీ స్క్వాడ్‌తోపాటు రెవెన్యూ అధికారి, ఎస్‌ఐ, విద్యా శాఖ అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. ఆర్‌ఐఓ బి.సుజాత మాట్లాడుతూ, ఫిబ్రవరి 2వ తేదీన ఎథిక్స్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష, 3న ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ పరీక్ష, 22న సమగ్ర శిక్ష ఒకేషనల్ ట్రేడ్ ఎన్ఎస్‌క్యూఎఫ్ లెవెల్-4 థియరీ పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

జగన్‌రెడ్డిని ఓడించేందుకు జనం సిద్ధం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ ప్రారంభమైందని, జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వానికి ఇంకా కేవలం 74 రోజులు మాత్రమే మిగిలివుందన్నారు. వైసీపీ అరాచక పాలనకు అంతం చేసేందుకు జనం సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల తరువాత వైఎస్ఆర్ జెండా కనుమరుగు కావడం ఖాయమన్నారు. వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం అన్నిరంగాల్లో నష్టపోయిందన్నారు. ఈ సమావేశానికి టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, జిల్లా కార్యదర్శి మళ్ల గణేష్ పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశాన్ని చేర్చాలి

- పంచకర్లకు ఉద్యోగుల వినతి

కొత్తూరు, జనవరి 29: జనసేన, తెలుగుదేశం పార్టీల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశాన్ని చేర్చాలని సీపీఎస్ ఉద్యోగులు జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబును కోరారు. సోమవారం వారు పంచకర్లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాథస్వామి, అదనపు కార్యదర్శి బోయిన చిన్నారావు, అనకాపల్లి రూరల్ మండల అధ్యక్షుడు గౌరీనాయుడు, అనకాపల్లి అర్బన్ గౌరవాధ్యక్షుడు బలిరెడ్డి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులు అర్ధనగ్నంగా నిరసన

అనకాపల్లి టౌన్, జనవరి 29: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సెర్ప్ (గ్రామీణ పేదరిక నిర్మూన సొసైటీ) ఉద్యోగులు సోమవారం అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. సెర్ప్ ఉద్యోగులు ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మె చేస్తూ నెహ్రూచౌక్‌లోని బస్టాప్ వద్ద దీక్షా శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం నియమించిన మంత్రుల సబ్ కమిటీ ద్వారా సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంతేకాక ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేసి సర్వీస్‌ను రెగ్యులర్ చేయాలని కోరారు. ఇందుకోసం ఆర్థిక శాఖ ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి పరిధిలో శాంక్షన్ పోస్టులుగా గుర్తిస్తూ ఇచ్చిన సర్క్యులర్ మెమోపై తగు జీవో విడుదల చేయాలని అన్నారు. ప్రస్తుతం ఉన్నట ఈపీఎఫ్ సీలింగ్ విధానాన్ని ఎత్తివేసి మూల వేతనంపై నూరు శాతం ఈపీఎఫ్‌ను అమలు చేయాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ ప్రకారం రూల్ ఆఫ్ రిజర్వేషన్లు వర్తింపజేస్తూ ఉద్యోగులందరికీ ప్రమోషన్లు కల్పించాలని, కారుణ్యనియామకాలు జరిపి మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు న్యాయం చేయాలని, పదవీవిరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు.


డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, వ్యవసాయాధికారులు

వ్యవసాయ శాఖ సంచిక విడుదల

పాడేరు జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖకు చెందిన డైరీలు, సంచికను జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తన చాంబర్‌లో సోమవారం విడుదల చేశారు. అలాగే ప్రభుత్వం రూపొందించిన ప్లాంట్స్ డాక్టర్స్ 2024-డైరీ, చిరుధాన్యాలతో వంద రకాల రుచికరమైన వంటల పుస్తకాన్ని, వ్యవసాయాధికారుల 2024 క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. చిరుధాన్యాలతో తయారు చేసే వివిధ రకాల వంటలపై ముద్రించిన పుస్తకం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాగులు, కొర్రలు, సామలు, అరికలు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలతో రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటలపై రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నంద్, వ్యవసాయ శాఖ ఏడీలు కె.జాహ్నవి, పి.మోహనరావు, వ్యవసాయాధికారుల అసోసియేషన్ కార్యదర్శి ఎల్ఆర్ బీ.పాత్రుడు, ఉపాధ్యక్షుడు మధు, ఏజెన్సీ మండలాల ఏవోలు పాల్గొన్నారు.

అల్లూరి, మల్లుదొర విగ్రహాల ఆవిష్కరణ


అల్లూరి, మల్లుదొర విగ్రహాల వద్ద నివాళులు అర్పిస్తున్న అధికారులు, నాయకులు

కొయ్యూరు, జనవరి 29: మండలంలోని కాకరపాడు కూడలిలో స్వాతంత్ర్య సమరయోధులు అల్లూరి సీతారామరాజు, గాం మల్లుదొర విగ్రహాలను సోమవారం ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షుడు పడాల వీరభద్రరావు తహసీల్దార్ తిరుమలరావు ఈ కార్యక్రమ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను యువత స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం కేసీఎస్ ట్రస్టు కార్యదర్శి సుబ్బారావు మాట్లాడుతూ గంటందొర, మల్లుదొర తదితర గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువత ముందుకు సాగాలన్నారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు పీవీ సత్యనారాయణరావును సత్కరించి స్వాతంత్ర్య సమరయోధుడు శతాధిక గ్రంథకర్త పడాల రామారావు శత జయంత్యుత్సవ స్మారక పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ పి.నూరిబాబు, అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు ఎస్.వరలక్ష్మి, వి.రమణమ్మ, చొక్కాకుల బాబ్జి, అల్లూరి అభిమానులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

» సీఐడీ డీఎస్పీ నాగేంద్రభూపాల్



మాట్లాడుతున్న డీఎస్పీ

పాడేరు రూరల్, జనవరి 29: రాజ్యాంగంలో ఎస్సీ ఎస్టీలకు పొందుపర్చిన హక్కులు, చట్టాలపై అవగాహన అవసరమని విశాఖపట్నం సీఐడీ డీఎస్పీ ఎం.నాగేంద్ర భూపాల్ చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో ఈ చట్టాలపై అవగాహన సంపూర్ణంగా లేకపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చట్టాలు, సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. విద్యావంతులైన గిరిజన యువతీ, యువకులు చట్టాలపై అవగాహన పెంచుకుని గ్రామాల్లో పెద్దలు, ప్రజలకు వివరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యా శాఖ డీడీ ఐ.కొండలరావు, తహసీల్దార్ వంజంగి త్రినాథరావునాయుడు, ఎంపీడీవో కె.సాయినవీన్, ఎస్ఐ జి.లక్ష్మణరావు, వివిధ సంఘాల నాయకులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ కేడర్‌లో అసంతృప్తి సెగలు

... 5వ పేజీ తరువాయి

కనిపిస్తున్నాయని, తెలుగుదేశం నాయకుడు బేబీ నాయన ప్రజల్లోకి దూసుకువెళుతూ ఆదరణ పొందుతున్నారంటూ ఆ నియోజకవర్గానికి చెందిన కృష్ణ అనే కార్యకర్త పేర్కొన్నారు. బొబ్బిలి నుంచి సమావేశానికి వచ్చిన సదరు కార్యకర్త... శంబంగి మంచివాడైనప్పటికీ బేబీ నాయనను తట్టుకోలేరని, ఓడిపోయే చాన్స్ ఉందంటూ విశ్లేషించారు. ఇక్కడ నుంచి జడ్పీ చైర్మన్ చిన్న శ్రీనును బరిలోకి దించితే కొంతవరకూ పోటీ ఇచ్చే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఇలా... మరికొన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన వైసీపీ కార్యకర్తలు కూడా స్థానిక ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడిచిన ఐదేళ్లలో తమకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని వాపోయారు. పార్టీ సమావేశాలకు, సభలకు రావడం తప్ప...కనీసం ఇల్లు కూడా పొందలేక పోయామంటూ నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఒక కార్యకర్త వాపోయారు. గ్రామ/మండల స్థాయిల్లో స్థానిక నేతల వ్యవహారశైలి వల్లే పార్టీపై వ్యతిరేకత పెరిగిందన్నారు.

షర్మిల ప్రభావంపై చర్చ

సభా ప్రాంగణంలో వైసీపీ కార్యకర్తలు షర్మిల ప్రభావంపైనా చర్చించుకుంటూ కనిపించారు. ఈసారి షర్మిల వల్ల కొంత ఓట్లు నష్టపోతామని కొందరు విశ్లేషించారు. షర్మిల చేస్తున్న తీవ్ర విమర్శలు పార్టీకి దెబ్బేనని ఆందోళన వ్యక్తంచేశారు. షర్మిలకు జగన్ ఏదో ఒక పదవి ఇచ్చేస్తే సరిపోయేదని, అలా చేయకుండా సమస్యను పెంచుకున్నా డంటూ పలువురు కార్యకర్తలు విశ్లేషించారు.

విద్యుత్ చార్జీలు పెంచబోం

... 5వ పేజీ తరువాయి

స్పష్టం చేశారు.

కొనుగోలు ఖర్చు యూనిట్ రూ.4.69

రాబోయే ఆర్థిక సంవత్సరంలో యూనిట్‌కు విద్యుత్ కొనుగోలు ఖర్చు రూ.4.69గా ఉంటుందని, ప్రసారం, పంపిణీ నష్టాల వ్యయం 49 పైసలు, నెట్ వర్క్ ఖర్చులు రూ.1.63, ఇతర ఖర్చులు 28 పైసలు కలిపి సర్వీసు వ్యయం యూనిట్‌కు రూ.7.09 అవుతుందని వివరించారు. సగటున యూనిట్‌కి రూ.6.01 వస్తుందని, రెండింటి మధ్య తేడా యూనిట్‌కి రూ.1.08 ఉంటుందని అంచనా వేశారు.

కొత్త ఆర్థిక సంవత్సరంలో గృహ వినియోగం 7,741.84 మిలియన్ యూనిట్లు ఉంటుందని, దాని ద్వారా రూ.3,764.76 కోట్లు వస్తుందని అంచనా వేశారు. వాణిజ్యానికి 1,501.26 మి.యూ. ఇవ్వడం ద్వారా రూ.1,534.45 కోట్లు వస్తుందని, పరిశ్రమలకు 494.59 మి.యూ. ఇవ్వడం వల్ల రూ.406.87 కోట్లు వస్తుందని, వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలకు 4,767.55 మి.యూ. ఇస్తే రూ.1,000.71 కోట్లు వస్తాయని, సంస్థాగతంగా 508.32 మి.యూ.కు రూ.384.32 కోట్లు రావచ్చునని మొత్తం చూసుకుంటే ఎల్‌టీ విభాగంలో 15,013.56 మి.యూ.కు రూ.7,091.11 కోట్లు వస్తాయని అంచనాలు చూపించారు. అదే హెచ్‌టీ విభాగంలో అయితే 14,840.50 మి.యూ.కు రూ.10,673.34 కోట్లు వస్తుందని వివరించారు.

వంద టన్నుల మిరియాలు కొనుగోలు లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

జాప్యం జరగదని స్పష్టం చేశారు. ఏజెన్సీలోని ఉద్యాన వనాధికారులు, కాఫీ లైజన్ వర్కర్లు ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు గ్రామాల్లో పర్యటించి మిరియాల రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. మిరియాలు నిల్వ చేయడానికి గిరిజన రైతులకు గోనె సంచులను ఉచితంగా సరఫరా చేస్తామన్నారు. స్పైసెస్ బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ బి.కల్యాణి మాట్లాడుతూ గిరిజన రైతులు మిరియాలను ఆధునిక, శాస్త్రీయ పద్ధతుల్లో సేకరించాలన్నారు. మిరియాలు బాగా ఎండిపోయి నల్లగా ఉంటే చక్కని ధర లభిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, కాఫీ సహాయ సంచాలకుడు ఎన్.అశోక్, కాఫీ బోర్డు ఇన్‌చార్జి డీడీ రమేశ్, ఏజెన్సీ పదకొండు మండలాల వ్యవసాయ, ఉద్యానవనాధికారులు, లైజన్ వర్కర్లు పాల్గొన్నారు.

కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

... 5వ పేజీ తరువాయి

తీవ్రత పెరిగింది. సోమవారం చింతపల్లిలో 11.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ తెలిపారు. చలితో పాటు మంచు దట్టంగా కురుస్తున్నది. ఉదయం పదిన్నర గంటల వరకు మంచు వీడడం లేదు.

వైసీపీకి చెక్ పెడదాం.. టీడీపీని గెలిపించుకుందాం..

» టీడీపీ నాయకుడు కేవీ.రమేష్‌నాయుడు

» పార్టీలోకి 300 మంది వైసీపీ కార్యకర్తలు


వంతాడపల్లిలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో రమేష్‌నాయుడు, నాయకులు

పాడేరు రూరల్, జనవరి 29: నాలుగున్నరేళ్ల వైసీపీ నిరంకుశ పాలనకు చెక్‌పెట్టి తెలుగుదేశం పార్టీని గెలిపించుకుందామని టీడీపీ యువ నేత కేవీ.రమేష్‌నాయుడు కోరారు. మండలంలోని వంతాడపల్లి పంచాయతీ కేంద్రంలో సోమవారం పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే ప్రజా ప్రయోజనాలను వివరించారు. వైసీపీ పాలనలో జగన్ అరాచకాలు, ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలు పేదల సంక్షేమానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా, దేశంలోనే రాజధాని లేని రాష్ట్రంగా ఏపీని తయారు చేశారన్నారు. ఇప్పటికైనా ప్రజలు జగన్ పాలన తీరును అర్థం చేసుకొని వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. అనంతరం సుమారు 300 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజు, రమాదేవి, అడపా నరసింహమూర్తి నాయుడు, సాగిన బొంజుబాబు, శోభ శ్రీనివాసరావు, శివ, కేశవ, శంకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

గూడెంకొత్తవీధి: గిరిజన గ్రామాలు అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ నేత కొట్టగుళ్లి సుబ్బారావు అన్నారు. మండలంలోని దేరాల, నూతులు గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన పథకాలపై ప్రజల్లో చర్చ మొదలైందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి పదేళ్లు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. గిరిజనులకు ప్రత్యేక సంక్షేమం అందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు టీడీపీకి అండగా నిలవాలని, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో సమాధానం చెప్పాలని కోరారు. అనంతరం గిరిజన యువకులకు వాలీబాల్ కిట్‌ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు ముక్కల మహేశ్, వి.బాలయ్య, కంకిపాటి నారాయణరావు, కొర్ర బలరామ్, కుర్ర రాంబాబు, బుజ్జిబాబు పాల్గొన్నారు.

చింతపల్లిలో పుట్టగొడుగుల పరిశ్రమ

» ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి శారదజయలక్ష్మి


గ్లాడియోలస్ పూలను పరిశీలిస్తున్న ఉపకులపతి డాక్టర్ శారద జయలక్ష్మి

చింతపల్లి, జనవరి 29: గిరిజన ఉప ప్రణాళిక నిధులతో చింతపల్లి కేంద్రంగా పుట్టగొడుగుల పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్టు ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మి తెలిపారు. సోమవారం జాతీయ సదస్సులో పాల్గొన్న ఆమె పరిశోధన స్థానంలో చేపడుతున్న వివిధ పంటల ప్రయోగాత్మక సాగును ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. గ్లాడియోలస్, చైనా ఆస్టర్ పూలు, కుంకుమ పువ్వు సాగును ఆమె స్వయంగా పరిశీలించారు. అనంతరం ఆమె కాన్ఫరెన్స్ హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో రూ.లక్షలు వెచ్చించి కృత్రిమ వాతావరణంలో పుట్టగొడుగుల పెంపకం చేపడుతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో సహజసిద్ధంగానే పుట్టగొడుగుల పెంపకానికి అవసరమైన వాతావరణం అందుబాటులో ఉన్నదన్నారు. ఈ నేపథ్యంలో చింతపల్లిలో పుట్టగొడుగులపై పూర్తి స్థాయిలో పరిశోధనలు నిర్వహించేందుకు ప్రత్యేక ప్రాజెక్టును మంజూరు చేస్తామన్నారు. పరిశోధనలతో పాటు పుట్టగొడుగుల ఉత్పత్తికి పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఆదివాసీ రైతులకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ ఇచ్చి సాగును ప్రోత్సహిస్తామన్నారు. రానున్న రోజుల్లో చింతపల్లి కేంద్రంగా భారీగా పుట్టగొడుగులను ఉత్పత్తి చేయాలని విశ్వవిద్యాలయం లక్ష్యమన్నారు. ప్రధానంగా బటన్ పుట్టగొడుగుల పెంపకానికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఆదివాసీ రైతులు సాధారణంగానే సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ ఉత్పత్తులను పండిస్తున్నారన్నారు. అయితే ఆర్గానిక్ ఉత్పత్తులుగా మార్కెటింగ్ చేసుకోలేకపోతున్నారని, దీంతో రైతులు అధిక ఆదాయం పొందలేకపోతున్నారన్నారు. పరిశోధన స్థానం ద్వారా గిరిజన రైతులకు సేంద్రియ సాగును ప్రోత్సహిస్తూ పండించిన పంటలకు ఆర్గానిక్ ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆర్గానిక్ ధ్రువీకరణ పత్రం కలిగివుంటే రైతులు సేంద్రియ ఉత్పత్తులుగా మార్కెట్‌లో విక్రయించుకుని రెట్టింపు ఆదాయం పొందవచ్చునన్నారు. అలాగే పరిశోధన స్థానంలో పూలసాగుపై పరిశోధనలు విస్తృతం చేస్తామని తెలిపారు. వచ్చే ఏడాది పర్యాటక ప్రాంతాల పరిధి ఆదివాసీ రైతులతో పూల సాగు చేపట్టనున్నామన్నారు. పరిశోధన స్థానంలో కుంకుమ పువ్వు, అరుదైన పూల సాగులో ఉత్తమ ఫలితాలు సాధించిన ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్‌ను అభినందిస్తున్నామన్నారు. ఆదివాసీల అభివృద్ధికి మరిన్ని పరిశోధనలు చేపట్టేందుకు ఆర్ఏఆర్ఎస్‌కి విశ్వవిద్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సీందరి ఉజ్వల రాణి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ముగ్గురు ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు

» రంపచోడవరం ఐటీడీఏ పీవోను ఆదేశించిన కలెక్టర్

పాడేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డుల పంపిణీలో అలక్ష్యంగా వున్న అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవోను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో ఆదిమ జాతి గిరిజనులకు కల్పించాల్సిన సౌకర్యాలపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం తన నివాసం నుంచి పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీవీటీజీలకు ప్రభుత్వం నుంచి అన్ని సదుపాయాలు, పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో కొత్తగా మంజూరైన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను లబ్ధిదారులకు అందించాలన్నారు. వాటి పంపిణీలో నిర్లక్ష్యంగా వున్న అడ్డతీగల, రాజవొమ్మంగి, గంగవరం ఎంపీడీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేను ఆదేశించారు. అలాగే ఐటీడీఏ పీవో పీహెచ్‌సీలను సందర్శించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో పరిస్థితులను స్వయం తెలుసుకునేందుకు గాను ఆ ప్రాంతంలో నలుగురితో కూడిన బృందం రాత్రి బస చేయాలన్నారు. అయితే రాజకీయ పార్టీలతో సంబంధం లేని వ్యక్తుల ఇళ్లల్లో మాత్రమే బస చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పీవోలు వి.అభిషేక్, సూరజ్ గనోరే, చైతన్య, జిల్లాలోని డీఎల్‌డీవోలు, 22 మండలాలకు చెందిన ఎంపీడీవోలు పాల్గొన్నారు.

69 మందికి వైద్య సేవలు

పాడేరు రూరల్, జనవరి 29: వనుగుపల్లి పంచాయతీలోని మారుమూల చింతగున్నల గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 69 మందికి వైద్య సేవలు అందించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలో 46 మంది సాధారణ జ్వరాలతో బాధ పడుతున్నట్టు గుర్తించి అవసరమైన మందులు అందించామని పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. ఇతర వ్యాధులతో బాధపడుతున్న ఇద్దరిని గుర్తించి పాడేరు జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశామన్నారు. అనంతరం వ్యాధుల బారి నుంచి రక్షణ పొందే అంశాలను, రోగాలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వరలక్ష్మి, శెట్టి నాగరాజు, ఎస్పీ పడాల్, వైవీ.రమణ, జేవీ చలం, లాలి తదితరులు పాల్గొన్నారు.

ఆటో స్టాండ్ స్థలాన్ని ధారాదత్తం చేయొద్దు

» ఐటీడీఏ ఎదుట డ్రైవర్ల ఆందోళన

పాడేరు రూరల్, జనవరి 29: ఐటీడీఏ కార్యాలయం పక్కనే ఖాళీ స్థలంలో ఎంతో కాలంగా ఆటోలను నిలిపి జీవనం సాగిస్తున్న నిరుద్యోగ యువతను బయటకు నెట్టి పొట్టలు కొట్టకండి మహాప్రభో అంటూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత ఎల్.సుందరరావు మాట్లాడుతూ ఏళ్ల తరబడి ఐటీడీఏ ప్రహరీ పక్కన ఆటోలను నిలిపి జీవనం సాగిస్తున్న స్థలాన్ని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఇటీవల అరకు కాఫీ స్టాల్ (జీసీసీ) నిర్మాణానికి కేటాయించడంతో తాము జీవనోపాధి కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీడీఏ పీవో పునరాలోచన చేసి ఆటో స్టాండ్ స్థలాన్ని ఆటో కార్మికులకే ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు పూర్తి

» వినియోగంలోకి డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలు

» జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రశాంత్‌కుమార్

సీలేరు, జనవరి 29: డొంకరాయి పవర్ కెనాల్ లీకేజీ మరమ్మతు పనులు పూర్తి చేసినట్టు జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కేకేవీ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లా డుతూ కెనాల్ నుంచి నీటిని విడుదల చేసి వినియోగంలోకి తీసుకొచ్చామని చెప్పారు. పవర్ కెనాల్ రీచ్ వన్ యూటీలో ఎలార్ట్‌మెంట్ వాల్వ్ వద్ద ఏర్పడిన లీకేజీని పెట్రోలింగ్ సిబ్బంది సకాలంలో గుర్తించడంతో యుద్ధప్రాతిపదికన కెనాల్ నుంచి నీటి విడుదలను నిలిపివేసి లీకేజీ అవుతున్న ప్రదేశంలో మరమ్మతు చేశారన్నారు. దీంతో డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించామన్నారు. అలాగే సోమవారం రాత్రి నుంచి పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం కూడా వినియోగంలోకి తీసుకువచ్చినట్టు ఆయన చెప్పారు.

విశాఖ రేంజ్ డీఐజీగా విశాల్ గున్ని

... 5వ పేజీ తరువాయి

జాయింట్ పోలీస్ కమిషనర్ పోస్టులో కె.ఫకీరప్పను నియమించారు.. డీసీపీ-1గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావును జగ్గయ్యపేట డీసీపీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో శ్రీకాకుళం జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీగా పనిచేస్తున్న మణికంఠ చందోల్‌ను నియమించారు. అలాగే డీసీపీ-2గా పనిచేస్తున్న కె.ఆనందరెడ్డిని విజయవాడ లా అండ్ ఆర్డర్ డీసీపీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో విజయవాడ డీసీపీగా పనిచేస్తున్న మోక సత్యనారాయణను నియమించారు. జాయింట్ కమిషనర్‌గా రానున్న ఫకీరప్ప గతంలో నగర లా అండ్ ఆర్డర్ డీసీపీగా పనిచేశారు. ఎన్నికల ముందు ఫకీరప్పను నగరానికి జాయింట్ పోలీస్ కమిషనర్‌గా నియమించడంపై పోలీసు వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతున్నది.

ఆదివాసీ రైతుల ప్రగతికి నూతన సంస్కరణలు

... 5వ పేజీ తరువాయి

చేశామన్నారు. ఒడిశా, వెస్ట్ బెంగాల్, అసోం, కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, వివిధ విభాగాల నిపుణులు మూడు అంశాలపై సుదీర్ఘంగా చర్చిస్తారన్నారు. ప్రధానంగా వాతావరణానికి అనుకూలమైన కొత్త పంటల్లో సాంకేతిక ఉత్పాదకత, పరిశీలన, విశ్లేషణ అంశాలపై చర్చించి ఐదేళ్ల అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తారని చెప్పారు. ఈ ప్రణాళికను అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక పంపిస్తామన్నారు. దక్షిణ భారత దేశంలోనే ఆంధ్రప్రదేశ్ గిరిజన మండలాలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ప్రాంతం ఉత్తర భారతదేశం, విదేశాల్లో సాగుచేసే విభిన్నమైన పంటల సాగుకు అత్యంత అనుకూలమన్నారు. కశ్మీర్‌లో పండించే తులిప్, లిల్లియం, చైనా ఆస్టర్, కుంకుమ పువ్వు ఈ ప్రాంతంలో పండుతుందన్నారు. ఈ పంటలను పరిచయం చేయడం వల్ల ఆదివాసీ రైతులకు అధిక ఆదాయం వస్తుందని, వారి జీవన విధానంలోనూ మార్పు వస్తుందని చెప్పారు. దీనికి అవసరమైన ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతంలోనే పండే వలిసెలు, రాజ్‌మా పంటల్లో మేలిరకం వంగడాలు అందజేసేందుకు పరిశోధనలు జరుగుతున్నాయన్నారు.

అగ్రి టూరిజం అభివృద్ధికి చర్యలు

పుట్టగొడుగుల పెంపకం మంచి కుటీర పరిశ్రమ అని తెలిపారు. గిరిజన ప్రాంతంలో అగ్రి టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వెంకటరామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ టి.జానకిరామ్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతం ఉద్యాన పంటల సాగుకి అత్యంత అనుకూలమన్నారు. ఆదివాసీ రైతులు పండించిన ఉద్యాన పంటలకు విలువలు జోడించి మార్కెట్‌లోకి తీసుకొస్తే మంచి లాభాలు వస్తాయన్నారు. కేరళలో పనసతో ఎన్నో ఆహార ఉత్పత్తులు రూపొందించి మార్కెట్‌లో విక్రయిస్తున్నారన్నారు. గిరిజన ప్రాంత రైతులు పనసను సరైన పద్ధతిలో సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. ఈ మేరకు పనసతో తయారుచేసే ఆహార ఉత్పత్తులపై ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించిందన్నారు. రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో ప్రోత్సహిస్తే కేరళ తరహాలో గిరిజన ప్రాంత రైతులు లాభాలను ఆర్జిస్తారన్నారు. ఒడిశా సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ప్రశాంత్‌కుమార్ మహంతి మాట్లాడుతూ మెజారిటీ ఆదివాసీలు అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఒడిశా ప్రాంతంలో ఆదివాసీ రైతులు సేకరించిన అటవీ ఉత్పత్తులకు విలువలు జోడించి మార్కెట్‌లోకి తీసుకొస్తున్నామని, దీంతో మంచి ఆదాయం పొందుతున్నారన్నారు. గిరిజన రైతులు సేకరించే అటవీ ఉత్పత్తులకు విలువలు జోడించేందుకు ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు. తూర్పు కనుముల్లో అరుదైన ఔషధ మొక్కలు ఉన్నాయని, రైతులను ఔషధ మొక్కల పెంపకంలోనూ ప్రోత్సహించడం అవసరమన్నారు. హైదరాబాద్ ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సి.తారా సత్యవతి వర్చువల్‌గా మాట్లాడుతూ గిరిజన ప్రాంతం చిరుధాన్యాలకు పుట్టినిల్లు అన్నారు. మారుతున్న మానవుల జీవన విధానంలో చిరుధాన్యాలకు ప్రత్యేక డిమాండ్ ఏర్పడిందన్నారు. ఆదివాసీ రైతులు సంప్రదాయంగా రాగి, సామ, కొర్ర, జొన్న పంటలు పండిస్తున్నారన్నారు. రైతులకు మేలిరకం విత్తనాలు అందిస్తే నాణ్యమైన దిగుబడులు సాధిస్తారని చెప్పారు. చిరుధాన్యాలను గ్రేడింగ్, ప్రాసెసింగ్ చేసి మార్కెట్‌లోకి తీసుకొస్తే ఆదివాసీ రైతులకు రెట్టింపు ఆదాయం వస్తుందన్నారు. చిరుధాన్యాల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక పరిశోధన స్థానం ఏడీఆర్, జాతీయ సదస్సు నిర్వాహక కమిటీ చైర్మన్ డాక్టర్ ఎం.సురేశ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో నిపుణుల కమిటీ సిఫారసు చేసిన అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఈ ప్రణాళికను విశ్వవిద్యాలయం ఆమోదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపిస్తామని, రానున్న రోజుల్లో గిరిజన ప్రాంతాల్లో అమలులోకి తీసుకొస్తామన్నారు. అనంతరం ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం ఉప కులపతి స్థానిక శాస్త్రవేత్తలు రూపొందించిన పరిశోధన ఫలితాల సమగ్ర సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పరిశోధన స్థానంలో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల ఆహార ఉత్పత్తుల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి, ఉద్యాన పరిశోధన స్థానం విస్తరణ సంచాలకులు డాక్టర్ ఇ.కరుణశ్రీ, విజయనగరం డాట్ సెంటర్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.తేజేశ్వరరావు, రిటైర్డ్ ఏడీఆర్ డాక్టర్ టి.రత్న సుధాకర్, తొగరం ఏహెచ్ ప్రొఫెసర్ దేశగిరి శేఖర్, గిరిజన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసన్, ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం బోర్డు సభ్యులు డాక్టర్ డి.కొండాడ రామిరెడ్డి, డి.కోటేశ్వరమ్మ, చింత ఈశ్వరరావు, డి.సాయిలక్ష్మి, పి.గురుమూర్తి, శాస్త్రవేత్తలు డాక్టర్ కదిరి మోహన్, డాక్టర్ శ్రీనివాసరావు, జోగారావు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

నిరుద్యోగ యువతకు సాంకేతిక శిక్షణ: పీవో అభిషేక్

పాడేరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన నిరుద్యోగ యువతకు ఉచితంగా సాంకేతిక శిక్షణ అందిస్తామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫ్రంట్ లైన్ ఆఫీస్ అసోసియేట్స్‌గా చింతపల్లిలో, ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులైన వారికి అరకులోయలో ఎలక్ట్రీషియన్ శిక్షణ, టెన్త్ పాసైన అభ్యర్థులకు డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ, ఎనిమిదో తరగతి అర్హత కలిగిన అభ్యర్థులకు పాడేరులో లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణను అందిస్తామన్నారు. సాంకేతిక శిక్షణ పొందాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు సంబంధిత ఎంపీడీవోల కార్యాలయాల్లో ఫిబ్రవరి ఏడో తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని పీవో సూచించారు. అలాగే శిక్షణ పర్యవేక్షణకు ఎం.సతీశ్‌కుమార్‌ను ప్లేస్‌మెంట్ అధికారిగా నియమించామన్నారు. మరిన్ని వివరాలకు 9398338105 సెల్ నంబర్‌కు సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని పీవో కోరారు.

గిరిజన చట్టాలపై చైతన్యం కావాలి

చింతపల్లి, జనవరి 29: గిరిజన చట్టాలు, హక్కులపై చైతన్యం కావాలని ఎంపీపీ కోరాబు అనుషదేవి సూచించారు. సీఐడీ సీఐ జె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అట్రాసిటీ కేసులపై సోమవారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. గిరిజనుల కోసం ప్రత్యేక చట్టాలు, హక్కులు అందుబాటులో ఉన్నాయన్నారు. భూ బదలాయింపు, పేసా, అటవీ హక్కుల చట్టాలు గిరిజనులకు రక్షణగా నిలుస్తున్నాయని చెప్పారు. చట్టంపై అవగాహన ఉంటే న్యాయం పొందే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా సీఐడీ సీఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు, ఎంఈవో పనసల ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు జయలక్ష్మి, దారలక్ష్మి పద్మ పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో కారు టైర్లు చోరీ

డుంబ్రిగుడ, జనవరి 29: మండల కేంద్రంలో ప్రమాదానికి గురైన ఓ కారు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం రాత్రి దొంగిలించుకుపోయారు. మండల కేంద్రంలోని గ్యాస్ గొడౌన్‌కు ఎదురుగా గత నెలలో కారు ప్రమాదానికి గురైంది. దీన్ని సంబంధిత యజమాని సంఘటన స్థలంలో విడిచి వెళ్లిపోయారు. ఈ కారు వెనుక భాగంలోని రెండు టైర్లతో పాటు విడి భాగాలను దుండగులు దొంగిలించుకుపోయారు. రోజుకో విడి భాగాలను తస్కరించిపోతున్నారని స్థానికులు తెలిపారు. పోలీసులు స్పందించి ప్రమాదానికి గురైన కారును స్టేషన్ లోపలికి తరలించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఉపాధి పనులను వినియోగించుకోండి

పాడేరు రూరల్, జనవరి 29: ఉపాధి పథకం పనులను వినియోగించుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎ.కృష్ణమూర్తి కోరారు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో సోమవారం రైతులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొత్త జాబ్ కార్డులు తీసుకోవడానికి ప్రభుత్వం నిరంతరం అవకాశం కల్పించిందని చెప్పారు. ప్రభుత్వ పథకాలు అందికపోతే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఆదివాసీ మిత్ర డైరెక్టర్ మన్మథరావు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రమేష్, ఏవో మహేష్ పాల్గొన్నారు.

శాంతిభద్రత సమస్య రాకుండా సహకరించండి: సీఐ వెంకటరమణ

కొయ్యూరు, జనవరి 29: ఎన్నికలు సమీపిస్తున్నందున సంఘ విద్రోహక శక్తులకు దూరంగా ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సీఐ వెంకటరమణ కోరారు. మండలంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన యు.చీడిపాలెం, పలకజీడి గ్రామాలను సోమవారం సందర్శించి అక్కడ ప్రజలతో సమావేశం నిర్వహించారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు లోకేష్‌కుమార్, దేముడు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ముంచంగిపుట్టు, జనవరి 29: ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సీఐ కె.రమేష్ స్పష్టం చేశారు. మండలంలోని మారుమూల లక్ష్మీపురం, మాకవరం, లబ్బూరు, పనసపుట్టు తదితర పంచాయతీల పరిధిలో పోలింగ్ కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని ఆయా ప్రాంతాల ప్రజలను ఆయన కోరారు. అలాగే లక్ష్మీపురం గిరిజనులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అకారణంగా పోలీసులు తమపై దాడులు చేస్తున్నారని గిరిజనులు సీఐ దృష్టికి తీసుకువచ్చారు. పోలీసులపై వస్తున్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేస్తామని సీఐ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.రవీంద్ర, సర్పంచులు కె.త్రినాథ్, ధనియా, నొబినో, ఎంపీటీసీ సభ్యులు సాధురం తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు

హుకుంపేట, జనవరి 29: మద్యం సీసాలతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎస్ఐ సతీష్ తెలిపారు. బి.బొడ్డపుట్టు పంచాయతీ దబ్బగరువు గ్రామంలో సోమవారం తనిఖీలు నిర్వహించగా కొర్రా ఈశ్వరావు ఇంటి వద్ద 15 మద్యం సీసాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. అలాగే 15 లీటర్ల సారాతో అదే గ్రామానికి చెందిన కొర్రా చిన్న పట్టుబడ్డారన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న వీరిద్దర్నీ అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

హుకుంపేట, జనవరి 29: మండలంలోని తాడిపుట్టు పంచాయతీ గడుగుపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి ఎంపీపీ కూడా రాజుబాబు, జడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జడ్పీ నిధులతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్టు చెప్పారు. త్వరితగతిన పనులు పూర్తి చేసే విధంగా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ సభ్యులు సింహాచలం పాల్గొన్నారు.

వృద్ధుడికి దుస్తుల పంపిణీ

ముంచంగిపుట్టు, జనవరి 29: కుమడ పంచాయతీ సిరిలిమెట్ట గ్రామానికి చెందిన వృద్ధుడు పి.టంటుకు టీడీపీ నాయకులు సోమవారం దుస్తులు, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. అదే గ్రామానికి చెందిన అనాథ బాలికకు స్టడీ మెటీరియల్‌ను అందించారు. పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు కె.సన్యాసమ్మ సౌజన్యంతో వీటిని అందించినట్టు టీడీపీ నేతలు బాస్కర్, దనుర్జయ్, సుబ్బారావు, త్రినాథ్, తిరుపతి, ఆనంద్ తెలిపారు.